క్లుప్తంగా

బాల్య వివాహాలను నిర్మూలించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ శంషాద్ బేగం

బేతంచెర్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డోన్ ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం పిలుపునిచ్చారు. మండల పరిధిలోని సీతారామాపురం ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టిక ఆహార మహోత్సవాలకు సీడీపీఓ హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండాలంటే క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే తనకు సమాచారం ఇవ్వాలన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి



విజయవాడలో వరద బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

డోన్ టౌన్ : ప్రకృతి విలయతాండవం వలన నష్టపోయిన వరద బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల రాముడు పిలుపునిచ్చారు. విజయవాడలో గురువారం వరద బాధితులకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంఎల్‌సీ డాక్టర్ కుంభ రవిబాబుతో కలిసి చీరలు, దుప్పట్లు, టవల్స్, బిస్కెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణిపాటి నవీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంభ ఉదయ్‌కుమార్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగసరి సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడాపోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్

డోన్ రూరల్ : మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామం వద్ద ఉన్న మోడల్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో విద్యార్థినీ, విద్యార్థులకు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు ప్రభాకర్, రామనరసప్ప తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, అథ్లెటిక్స్, బాడ్మింటన్ క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి విద్యార్థులు మోడల్ స్కూల్ వద్దకు రావాలని సూచించారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్, శ్రీనివాసులు, నారాయణ, దాస్, సుజాత, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

బనగానపల్లె రూరల్ : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన అవుకు, బనగానపల్లె మండలాల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు పి.ముకుందరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రామచంద్రా రెడ్డి, హరినాథ్‌గౌడ్,మహమ్మద్‌రఫీ,ప్రసాదరావు, ఎల్లసుబ్బయ్యను పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు. సంఘం నాయకులు జానకిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి,హనీఫ్, కె.రాంపుల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సజ్జాద్,రఘునాథ్,దస్తగిరి,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసు రత్నం

బేతంచెర్ల: రవాణా రంగంలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, జీవో నెంబర్ 21 తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసు రత్నం, ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో గురువారం యూనియన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం రవాణ రంగంపై మోపిన భారాలను తగ్గించి జీవో నంబర్ 21ను తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



వరినాట్లు వేసేందుకు నారుమడిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న రైతులు



వరినాట్లు వేస్తున్న కూలీలు



నిండుగా ప్రవహిస్తున్న ఎస్‌ఆర్‌బీసీ కాలువ

జోరుగా వరి నాట్లు

- ఎస్సార్‌బీసీ, బోర్ల పరిధిలో పంట సాగు
- గతేడాది మూడు వేల ఎకరాల్లో సాగు
- ప్రస్తుతం 5వేల ఎకరాల వరకు సాగయ్యే అవకాశం

బనగానపల్లె రూరల్ : మండలంలో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు కాస్త ముందస్తుగానే కురిసినా.. ఆ తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో వరి సాగుకు రైతన్నలు వెనకడుగు వేశారు. గత నెల నుంచి భారీ వర్షాలు కురవడంతో శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయిలో నిండి, గోరుకల్లు రిజర్వాయర్‌కు సమృద్ధిగా నీరు చేరడంతో అధికారులు ఎస్‌ఆర్‌బీసీ కాల్వలకు నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు బోర్లతో పాటు ఎస్‌ఆర్‌బీసీ ఆయకట్టు పరిధిలో వరినాట్లు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది సుమారు మూడు వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం 5 వేల ఎకరాల వరకు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

వరిలో జింక్ లోపం లేకుండా చూసుకోవాలి

మహానంది: వరి పంటలో జింకు లోపించకుండా చూసుకోవాలని, ఎకరాకు ఇరవై కిలోల ముడి జింక్ ఆఖరి దమ్ములో వేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సరళమ్మ సూచించారు. ఆమె గురువారం నందిపల్లెలో వరి పంటపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహానంది మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏడీఏ సరళమ్మ మాట్లాడుతూ.. వరిపంటలో జీవన ఎరువుల ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ముడి జింకును భాస్వరం ఎరువులతో కలిపి వాడొద్దని సూచించారు. వరి పంటలో నీటి యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త బాలునాయక్, ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఓ శ్రీనివాసరెడ్డి, గ్రామ వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం అధికారులు, అర్చకుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

కామేశ్వరిదేవికి పట్టువస్త్రాల సమర్పణ

మహానంది: మహానందిలో అక్టోబర్ 3వ తేదీ నుంచి జరగనున్న దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీకామేశ్వరిదేవి అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన వారణాసి రామ్మోహన్‌రావు, విజయలక్ష్మి దంపతులు గురువారం పట్టువస్త్రాలు సమర్పించినట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.గురువారం దాతలు అమ్మవారి మూల మూర్తులకు అలంకరించేందుకు పట్టువస్త్రాలను ఏఈఓ మధు, వేదపండితులకు అందజేశారు. వారణాసి రామ్మోహన్‌రావు దంపతులు గత 20ఏళ్ల నుంచి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది.

రూ.1.30 లక్షలు విరాళాల సేకరణ

మహానంది: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మహానంది గ్రామ పంచాయతీ నుంచి రూ.1.30 లక్షలు విరాళాలు సేకరించినట్లు టీడీపీ నాయకుడు సూరె శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక నాయకులు గంగిశెట్టి మల్లికార్జున, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ గౌడ్‌తో కలిసి విరాళాలు సేకరించారు. తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెల్దుర్తి: హైవే- 44పై మదార్‌పురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన శ్రావణ్ మహేశ్ గాయపడ్డాడు. గుంతకల్ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న శ్రావణ్ మహేశ్ సంఘటనా స్థలంలో కారు పక్కకు ఆపి డ్రైవింగ్ సీటు నుంచి దిగుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం కారును, మహేశ్‌ను ఢీకొట్టింది. దీంతో శ్రావణ్ మహేశ్ ఎగిరి దూరంగా పడటంతో అతని నడుముకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్ ద్వారా కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

ముగిసిన హ్యాండ్‌బాల్ పోటీలు



ట్రోఫీ, మెడల్స్‌తో విజేత సెయింట్ జోసెఫ్ స్కూల్ జట్టు

కర్నూలు (టౌన్): నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బాలబాలికల అంతర్ పాఠశాలల హ్యాండ్‌బాల్ పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. బాలుర విభాగంలో సెయింట్ జోసెఫ్ పాఠశాల జట్టు, బాలికల విభాగంలో డోన్ కేజీబీవీ జట్టు విజేతలుగా నిలిచాయి. స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్ రెడ్డి పాల్గొని విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. బాలుర విభాగంలో సెయింట్ జోసఫ్ పాఠశాల (మొదటి), గూళ్యం జెడ్పీ స్కూల్ (ద్వితీయ), ఆదర్శ విద్యా మందిర్ (తృతీయ స్థానం), బాలికల విభాగంలో డోన్ కేజీబీవీ (మొదటి), మాంటిస్సోరి స్కూల్ (ద్వితీయ), గూళ్యం జెడ్పీ స్కూల్ (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు చిన్న సుంకన్న పాల్గొన్నారు.

యోగా పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): ఈనెల 14, 15 తేదీల్లో విశాఖపట్నం జిల్లా భీమిలిలో నిర్వహించనున్న 49వ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు పతకాలే లక్ష్యంగా సత్తా చాటాలని జిల్లా యోగా సంఘం చైర్మన్ శ్రీధర్ రెడ్డి, అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి సూచించారు. గురువారం విశాఖపట్నంకు బయలుదేరుతున్న జిల్లా జట్టును సాగనంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు అవకాశాలను వినియోగించుకొని ప్రతిభ చాటాలన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, యోగా సంఘం జిల్లా కార్యదర్శి అవినాష్ శెట్టి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

బేతంచెర్ల: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లాఅధ్యక్షులు ఏసు రత్నం, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏడవ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలముందు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేయాలన్నారు.

వ్యక్తిపై దాడి

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామానికి చెందిన దూదేకుల పెద్ద బాషాను వ్యక్తిగత మనస్పర్థలతో అదే గ్రామానికి చెందిన దూదేకుల మా బాషా ఆటోతో తగిలించాడు. కిందపడిన దూదేకుల పెద్ద బాషాపై దూదేకుల మా బాషా రాయితో దాడిచేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం బాషా గురువారం తెలిపారు.

నిత్యావసర సరుకుల అందజేత

కోవెలకుంట్ల: విజయవాడలోని వాంబే కాలనీలో ఉన్న మాతృదేవోభవ వృద్ధాశ్రమానికి వరదతో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో విక్కీ ఫౌండేషన్ అధినేత గోపిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రూ.5 వేలు విలువజేసే నిత్యావసర సరుకులను వృద్ధులకు అందజేశారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

బండిఆత్మకూరు: పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి స్వాతి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. మండలంలో 26,200 మందికిగాను 12,300 మంది మాత్రమే ఈ-కేవైసీ చేయించుకున్నట్లు చెప్పారు. రైతులందరూ ఈ నెల 15వ తేదీలోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని లేకపోతే ప్రభుత్వ పథకాలు వర్తించవని చెప్పారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: మండలపరిధిలోని చింతలపల్లి గ్రామానికి చెందిన బోయ మద్దిలేటి నుంచి 17 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు. బోయ మద్దిలేటి తన ఇంటివద్ద మద్యం విక్రయిస్తుండగా, సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

జూపాడుబంగ్లా: రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయపద్ధతులు అవలంభించాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని తరిగోపుల గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ రైతులు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని అలవర్చుకోవాలన్నారు.

వరద బాధితుల సహాయ నిధికి రూ.6.61 లక్షల విరాళం

బేతంచెర్ల: పట్టణంలోని ఫ్యాక్టరీ ఓనర్స్, లారీ ఓనర్స్ అసోసియేషన్స్‌తోపాటు షాపుల యజమాన్యాలు పట్టణ ప్రజల సహకారంతో విజయవాడ వరద బాధితుల సీఎం సహాయ నిధికి రూ.6.61 లక్షల చెక్కును ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డికి గురువారం అందజేశారు. ఆపదలో ఉన్న బాధితులకు సహాయం అందించడానికి మానవత్వంతో విరాళాలు సేకరించి అందజేసిన నాయకులను ఎమ్మెల్యే అభినందించారు.

25న చెకుముకి పరీక్షలు

ప్యాపిలి: చెకుముకి మండలస్థాయి పరీక్షలు సెప్టెంబర్ 25వ తేదీన నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్ తెలిపారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం చెకుముకి పరీక్షల పోస్టర్లలను ఎంఈఓ వెంకటేశ్ నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అబ్దుల్ లతీఫ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచడానికి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 25న పాఠశాల స్థాయి, అక్టోబర్ 1న మండల స్థాయి, అక్టోబర్ 27న జిల్లా స్థాయి, నవంబర్ 9,10 తేదీల్లో రాష్ట్రస్థాయిలో చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఉమాదేవి, అన్వర్‌బాషా, ఉమా, వెంకటేశ్, యూటీఎఫ్ నాయకులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న అవగాహన సదస్సు

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18వ తేదీన పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాదరెడ్డి గురువారం తెలిపారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో కస్తూర్బా పాఠశాల సమీపంలోని ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు చేశారు. అక్కడ పరిశ్రమల స్థాపన కోసం మౌలిక వసతులు ఏర్పాటు చేశారన్నారు. పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించేందుకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని, ఆసక్తిగల వారు హాజరు కావాలని కోరారు.

నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి

సంజామల: గర్భిణులు,పిల్లలు,బాలింతలకు నాణ్యమైన పోషకాహారాన్ని అందిస్తే రక్తహీనతను నివారించవచ్చని సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. మండలంలోని ముక్కమల్ల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పోషకాహార ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆమె మాట్లడుతూ..అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత,ముక్కమల్ల సచివాలయ ఏఎన్‌ఎం నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడిగా లింగస్వామి

నంద్యాల(రూరల్) రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా మేకల లింగ స్వామిని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుకుమార్ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గురువారం స్థానిక పట్టణంలోని నిశాంతి భవనంలో పార్టీ జిల్లా కమిటీని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులను నూతనంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఉన్న రిపబ్లిక్ పార్టీఆఫ్ ఇండియా పార్టీని అన్ని నియోజకవర్గాలలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు లింగస్వామి మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజలు రాజకీయంగా ఎదుగుటకు మంచి అవకాశం అన్నారు. త్వరలో అన్ని నియోజక వర్గాలలో పార్టీ తరుపున ఇన్‌చార్జ్‌లను నియమిస్తామన్నారు. పార్టీ రాయలసీమ కన్వీనర్ ధర్మరాజు, ఉమ్మడి జిల్లాల కార్యదర్శి శ్యామ్, విజయ రాజు పాల్గొన్నారు.

భగత్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే కోట్లకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

డోన్ రూరల్ : స్వాతంత్ర్య సరమయోధుడు సర్దార్ భగత్ సింగ్ విగ్రహన్ని డోన్ పట్టణంలో ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. భగత్ సింగ్ విగ్రహన్ని ఏర్పాటు చేసి, ఆయన త్యాగాలను యువతకు తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని నాయకులు ఎమ్మెల్యేను కోరారు. అలాగే చిగురుమాన్‌పేటలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రణత్‌యాదవ్, శశిధర్‌రెడ్డి, చంద్రశేఖర్, కేశవులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ముస్లిం మైనార్టీ పెద్దలు

బేతంచెర్ల: పట్టణంలోని షాదీఖానాలో బేతంచెర్ల ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహబూబ్ వలి, సద్దాం అలీబేగ్ ఆధ్వర్యంలో మిలాద్ నబీ పండుగను పురస్కరించుకుని గురువారం మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన అయిషా సిద్దికా, అమినా అంజుమ్, సన సోఫియా, అస్లాం, గోకారి నస్రీన్‌తోపాటు పాల్గొన్న విద్యార్థులకు మండల ఖాజీ నూర్ అహ్మద్, ముస్లిం మైనార్టీ పెద్దలు ముర్తుజావలీ, ఖాజా, మహమ్మద్ హనిఫ్ ఉపాధ్యాయుల చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అక్బాబ్, షేక్ ఉసేన్, సమోసవలీ, సికిందర్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో వికసిత్ భారత్‌పై గురువారం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ప్రతిభ ఆధారంగా జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారని ఎంఈఓ అబ్దుల్ కలాం చెప్పారు. ఆరవ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు హాజరై తెలుగు, ఇంగ్లిష్ మీడియం వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారన్నారు.

పాఠ్యపుస్తకాలు మంజూరు..

పాఠశాలలకు రెండో విడత 4,600 పాఠ్య పుస్తకాలు మంజూరైనట్లు ఎంఈఓ తెలిపారు. పుస్తకాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు వచ్చాయని పేర్కొన్నారు.

వినాయకా.. సెలవిక



శ్రీశైలంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు



పైపాలెంలో లడ్డూను దక్కించుకున్న నరేష్

శ్రీశైలంటెంపుల్: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో ఆయా ప్రదేశాలలో ఏర్పాటు చేసిన గణనాథులను గురువారం నిమజ్జనం చేశారు. క్షేత్ర పరిధిలోని శ్రీగిరికాలనీ, కొత్తపేట, యాదవ సత్రం, మేకలబండ, వ్యాపార సంఘం, వసతి విభాగం తదితర ప్రదేశాలలో నెలకొల్పిన గణనాథులకు ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం నిమజ్జన పూజలు నిర్వహించి, లడ్డూ ప్రసాదాలను వేలం వేశారు. మొత్తం 36 చోట్ల గణేశ్ మండపాలు ఏర్పాటు చేయగా, 22 విగ్రహాలను నిమజ్జనం చేశారు. సీఐ జి.ప్రసాదరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు

మిడుతూరు: మండలపరిధిలోని పైపాలం గ్రామంలో వినాయకుడి నిమజ్జన వేడుకలను భజరంగ్ దళ్ యూత్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పైపాలం గ్రామంలో శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా వెళ్లి వినాయకుడిని నిమజ్జనం చేశారు. వినాయకుడి లడ్డూను మద్రి బజారు కుమారుడు నరేష్ రూ. 15,500లకు, కలశం మీద ఉన్న టెంకాయను రూ.3,900 లకు వెంకటేశ్వర్లు కుమారుడు సంతోష్ దక్కించుకున్నారు.

పంట నమోదు చేయించుకుంటేనే పరిహారం



తిమ్మాపురంలో పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు

మహానంది: అరటి సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని నంద్యాల జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు సూచించారు. మండలంలోని తిమ్మాపురం, బుక్కాపురం గ్రామాల పరిధిలో గురువారం మండల ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్‌తో కలిసి అరటి తోటలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అరటి పంటలకు మండలాన్ని యూనిట్‌గా చేసుకొని బీమాను వర్తింపచేస్తున్నారని చెప్పారు. అరటి రైతులు తప్పనిసరిగా ఈ నెల 15వ తేదీలోగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. బీమాతో పాటు పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన సమయంలో పరిహారం అందేందుకు దోహదపడుతుందన్నారు. మార్కెటింగ్, ప్రత్యేక రాయితీలు లాంటి లబ్ధి పొందాలంటే పంట నమోదు కీలకమని చెప్పారు. గ్రామ వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బందిని సంప్రదించి వెంటనే పంట నమోదు చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. వీహెచ్ఏ వసుంధర, సిబ్బంది పాల్గొన్నారు.

వీబీఆర్‌కు 10,300 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

వెలుగోడు: బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు ఛానల్ ద్వారా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి 10300 క్యూసెక్కుల జలాలు వచ్చి చేరుతున్నట్లు తెలుగుగంగ ఏఈ శివనాయక్ తెలిపారు. తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గాలేరు నదికి 5 వేల క్యూసెక్కులు, మద్రాస్ కాలువకు 5 వేల క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 50 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కులు నీటిని దిగువకు పంపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వీబీఆర్‌లో గురువారం 14.655 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ చెప్పారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్

వెలుగోడు: పట్టణంలోని రోఖియాబీ దర్గా ఆవరణలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉస్మానియా ముస్లిం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో శాంతిరాం ఐ హాస్పిటల్ (కర్నూలు) సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 175 మంది కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 30 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని కంటి వైద్య నిపుణులు శేఖర్ తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారిని ప్రత్యేక వాహనంలో శాంతిరాం ఐ హాస్పిటల్ (కర్నూలు)కు తరలించి శస్త్రచికిత్స చేయిస్తామన్నారు. శిబిరంలో మందులు, ఐ డ్రాప్స్ అందజేశారు.

హెడ్‌రెగ్యులేటర్ వద్ద చేపలుపడితే ఉపేక్షించం



హెడ్‌రెగ్యులేటర్ వద్ద వలలు తీయిస్తున్న పోలీసులు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద మత్స్యకారులు ఎవరైనా చేపలుపడితే ఉపేక్షించేదిలేదని ఎస్ఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. చాబోలు గ్రామానికి చెందిన ఇరువర్గాల మత్స్యకారులు చేపలు పట్టుకునే విషయంలో వాగ్వాదానికి పాల్పడిన నేపథ్యంలో గురువారం ఎస్ఐ వారిని స్టేషన్‌కు పిలిపించారు. వారితో మాట్లాడి సామరస్యంగా చేపలుపట్టుకోవాలని సూచించారు. అందుకు ఓ వర్గం అంగీకరించగా మరోవర్గం వారు స్టేషన్ వద్ద నుంచి వెళ్లిపోయారు. దీంతో హెడ్‌రెగ్యులేటర్ వద్ద ఎవ్వరూ చేపలుపట్టుకోవద్దని చెప్పారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద మత్స్యకారులెవ్వరూ చేపలుపట్టరాదని హెచ్చరిస్తూ.. అక్కడ చేపలుపట్టే వారిని పంపివేశారు.